క్లుప్తంగా

14న అమర జవాన్లకు నివాళి

కుత్బుల్లాపూర్: జమ్ము కాశ్మీర్‌లోని పుల్వామా ఉగ్రదాడిని ఖండిస్తూ ఈనెల 14న దూలపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అమరులైన భారత సైనికులకు నివాళులర్పించనున్నట్లు దూలపల్లి బజరంగ్‌దళ్ ప్రఖండా ఓ ప్రకటనలో తెలియజేశారు. అవంతీపురా సమీపంలో సైనికులు వెళ్తున్న వాహనంపై కారుతో జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మృతి చెందారని, ఇటువంటి ఉగ్రవాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పాల్గొని అమర జవాన్లకు నివాళులర్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు.

◆ **ధోలారీ ధనీ, అపర్ణ ఫీడర్ల పరిధిలో..**
ధోలారీ ధనీ, అపర్ణ ఫీడర్ల పరిధిలోని పోచమ్మ గడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, ధోలారీధనీ రోడ్డు, కొంపల్లి స్మశానగడ్డ, హార్లిక్స్ స్ట్రీట్, సంగంరెడ్డి కాంప్లెక్స్, శ్రీకాంత్ నర్సరీ, వెంకటరెడ్డి భారత్ పెట్రోల్ పంప్ లేన్, ఎస్ఎస్ఆర్, చంద్రారెడ్డి ఫంక్షన్ హాళ్ల లేన్, సెంట్రల్ పార్కు, ఏఎంఆర్ ఫంక్షన్‌హాలు లేన్, వెంకటసాయి కాలనీ, మికాసా స్టెర్లింగ్, రాజధాని దాబా లేన్, అపర్ణ, స్ప్లెండర్ అపర్ణ, దేవేందర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు..

నూజివీడు ఫీడర్ పరిధిలో...
◆ నూజివీడు ఫీడర్ పరిధిలోని ఎంఎన్‌కే విటాస్ విల్లాస్, దూలపల్లి రోడ్డు, నాగార్జున హోమ్స్, ఎస్ఎస్ఎల్ అపార్ట్‌మెంట్స్, శాంతినికేతన్ విల్లాస్, అప్పలరాజు మహేంద్ర షోరూమ్, అపర్ణ సెకండ్ గేట్ వీ3 విల్లాస్, కొంపల్లి గ్రామం, సెంట్రల్ పార్కు, కుమ్మరి బస్తీ, ఆంధ్ర బస్తీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5.30గంటల వరకు.

కొంపల్లి ఫీడర్ పరిధిలో..
◆ కొంపల్లి ఫీడర్ పరిధిలోని సెంట్రల్ పార్కు, కుమ్మరి బస్తీ, ఆంధ్రబస్తీ, మున్సిపల్ కార్యాలయం ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఇది గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

చింతల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..
చింతల్: చింతల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మెయింటెనెన్స్ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని



కుత్బుల్లాపూర్ ఏఈ రవీందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రాఘవేంద్రకాలనీ, బ్యాంకుకాలనీ, వెంకటేశ్వర నగర్, ఎంఎన్‌రెడ్డి నగర్, అదే విధంగా 11కేవీ ద్వారకానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ద్వారకనగర్, ప్రసూననగర్, మధుసూదన్‌రెడ్డి నగర్, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..
నిజాంపేట్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం కలుగనుందని ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎస్ఎంఎస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే విధంగా ఏసీటైర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు బొల్లారం, రైసినా అపార్ట్‌మెంట్స్, మమత హాస్పటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలో...
సుభాష్‌నగర్: గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని ఏఏఈ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆర్ఎంనగర్ ఫీడర్ పరిధిలోని పీపీ నగర్, భవానీనగర్, చంద్రగిరినగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, తిరుపతి రెడ్డి బస్తీ, అంబేడ్కర్‌నగర్, ఉమాదేవినగర్, ఎన్టీఆర్ నగర్, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు..

◆ అదే విధంగా శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, ఏఅండ్‌బీ, బేకరీగడ్డ, సుభాష్‌చంద్రబోస్ నగర్, ఎన్టీఆర్ నగర్ ఏఅండ్‌బీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు.

ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో...
నిజాంపేట్: ప్రగతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త ఫీడర్ ఎరక్షన్ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ డాక్టర్ కాలనీ ఓహెచ్ ఫీడర్, ఎలీప్ కేబుల్ ఫీడర్, ఎలీప్ ఓహెచ్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్ఆర్ఐ కాలనీ, అక్షర స్కూల్ ఏరియా, ఎలీప్ సర్కిల్ ప్రాంతం, విష్ణుప్రియనగర్, జగన్ స్టూడియో ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గ్రామానికి అంతా మంచే జరుగుతుంది

భవిష్యవాణిలో అమ్మవారు



భవిష్యవాణి వినిపిస్తున్న రాజేష్

సూరారంలోని కట్ట మైసమ్మ, రేణుక ఎల్లమ్మ జాతరలో భాగంగా సోమవారం రంగం, భవిష్యవాణి, పోతరాజుల విన్యాసాల ఊరేగింపు కనులపండగ జరిగింది. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ముఖ్య అతిథి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన రాజేష్ భవిష్యవాణిని వినిపించారు. రాబోయే రోజుల్లో గ్రామానికి అంతా మంచే జరుగుతుందన్నారు. ఎలాంటి ఆటంకాలు రాకుండా చూస్తానని చెప్పారు. అమ్మవారికి సమర్పించిన చీరలను ఆలయ కమిటీ వేలంపాట వేయగా కొనడానికి మహిళలు పోటీ పడ్డారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. – సుభాష్‌నగర్



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు కృషి

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

జీడిమెట్ల: కాంగ్రెస్ పార్టీ దేశంలో ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తోందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల డిపో చౌరస్తా, దుర్గాకాలనీ, జనప్రియ అపార్ట్‌మెంట్స్, మోడీ బిల్డర్స్, ఎస్ఆర్ నాయక్‌నగర్, అపురూపకాలనీ లాస్ట్ బస్టాప్ ప్రాంతాల్లో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహించిన హన్మంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు.

◆ ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ హాత్ సే హాత్ కరపత్రాలను ప్రజలకు పంచుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో ప్రజలు తీవ్రంగా మోసపోయారని అన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంతో ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలపరిచి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు



ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

ప్రజలు సహకరించాలని కోరారు.

◆ ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, అల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు జేమ్స్, సొమ్మనగారి శ్రీధర్‌రెడ్డి, సంగం వీరేష్ గుప్తా, గురువారెడ్డి, రాంచందర్, హేమరాణి, సుల్తానా బేగం, పండరిరావు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ కమిటీల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌కు కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్: అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. వడ్డెర కులస్తులను బీసీ జాబితా నుంచి తొలగించి ఎస్సీ జాబితాలోకి చేర్చాలని అసెంబ్లీ వేదికగా ప్రస్తావించారు.

◆ ఈ నేపథ్యంలో వడ్డెర సంఘం నేషనల్ ప్రెసిడెంట్ వేముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో అదే విధంగా గాగిల్లాపూర్‌కు బస్తీ దవాఖానాను మంజూరు, దివ్యాంగుల సమస్యలతో పాటు అన్ని ఆర్టీసీ సర్వీసులకు ఒకే పాస్ ఇవ్వాలని అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు సత్కరించారు.

◆ జగద్గిరిగుట్ట కొండపై వెలసిన మల్లికార్జున స్వామి భ్రమరాంబిక, కేతమ్మ ఆలయ 37వ కల్యాణ మహోత్సవ గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించగా ఆలయ చైర్మన్ జేకే శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుకు శుభాకాంక్షలు

దుండిగల్: తెలంగాణ శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.. సోమవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు సంఘాలు, ప్రజా ప్రతినిధులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత, నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ చిట్ల దివాకర్ తదితరులు శంభీపూర్‌రాజును కలిసి సత్కరించారు.



శంభీపూర్ రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కొంపల్లి చైర్మన్ శ్రీశైలంయాదవ్, సన్న కవిత

నేడు పీఎంఈజీపీపై అవగాహన సదస్సు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిశ్రమల కేంద్రం అండ్ ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ)పై మంగళవారం ఈసీఐఎల్, కమలానగర్(కాప్రా)లోని ఎన్ఎస్ఐసీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం రవీందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో పథకంపై విధి విధానాలు, దరఖాస్తు విధానం, కావలిసిన దస్త్రాలు మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన యువత, స్వయం సహాయక బృందాలు, సొసైటీ చట్టం 1860 కింద నమోదైన సంస్థలు, ఉత్పత్తి సహకార సంఘాలు, ట్రస్టులు ఆర్థిక సాయం పొందేందుకు అర్హులన్నారు. తయారీ రంగ పరిశ్రమలకు గరిష్ఠంగా ప్రాజెక్టు వ్యయ పరిమితి రూ.50లక్షలు, సేవా రంగ పరిశ్రమలకు రూ.20 లక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకంలో 25 నుంచి 35 శాతం వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత, స్వయం సహాయక బృందాలు పాల్గొనాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు (9440412398)ను సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ ఫెస్ట్‌లకు మూడు మనూ సినిమాలు ఎంపిక

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో రూపొందించిన మూడు చిత్రాలు అంతర్జాతీయ ఫెస్ట్‌లకు ఎంపికయ్యాయి. ఉర్దూ యూనివర్శిటీలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో నిర్మించిన మూడు చిత్రాలు ఎంపిక కావడం విశేషం. ఈ మూడు చిత్రాలు రెండు ప్రతిష్ఠాత్మక చలనచిత్రోత్సవాలకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ ఈ చిత్రాల ఎంపికపై ఆయన సోమవారం వివరించారు. ఫైన్‌వుడ్ ఫిల్మ్ స్టూడియో, ఐవర్, బకింగ్‌హామ్‌షైర్, మరో రెండు డాక్యుమెంటరీ చిత్రాలు 'ఎనర్జీ ఫ్రమ్ వేస్ట్, 'చే లిఫ్ట్–ఆఫ్ గ్లోబల్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ కోసం షార్ట్ ఫిల్మ్ 'అరిస్టాటిల్' ఎంపిక అయింద న్నారు.



గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనాభవనం

కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేసన్(సీఈసీ,యూజీసీ) మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ద్వారా 14వ ప్రకీర్తి ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్క్రీనింగ్ కోసం ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియాకు ఎంపికైందన్నారు.

ఆర్టీసీ కానిస్టేబుళ్లకు ఓరియంటేషన్ ట్రైనింగ్

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్‌టీసీ)లోని కానిస్టేబుళ్లకు ఓరియెంటేషన్ ట్రైనింగ్‌ను ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జాయింట్ డైరెక్టర్ సంగ్రం సంఘజీ పటేల్ ప్రారంభించారు. కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో 166 మంది ఆర్టీసీ కానిస్టేబుళ్లకు ఓరియెంటేషన్ ట్రైనింగ్‌ను బెటాలియన్ కమాండెంట్ మురళి కృష్ణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఇందులో 106 మంది పురుషులు, 59 మంది మహిళ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కృష్ణకాంత్, హైదరాబాద్ జోన్ విజిలెన్స్ సెక్యూరిటీ రామమూర్తి, ట్రైనింగ్ హెడ్ ఎస్.వి.రమణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతిభాపులే, కోఆర్డినేటర్,



శిక్షణను ప్రారంభిస్తున్న ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జాయింట్ డైరెక్టర్ సంగ్రం సంఘజీ పటేల్

అసిస్టెంట్ కమాండెంట్ డి.నారాయణ దాసు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

15న కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

నిజాంపేట్: మనుస్మృతి గ్రంథాన్ని ఈ నెల 15న నగరంలో ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కృపాసాగర్, ప్రధాన కార్యదర్శి బాలపీరు ఓ ప్రకటనలో తెలియజేశారు. అన్ని ప్రజా సంఘాల నాయకులు ఈ నిరసనల్లో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

18న కల్యాణ మహోత్సవం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీమల్లికార్జున భ్రమరాంబిక, కేతమ్మ ఆలయంలో ఈనెల 18న మహా శివరాత్రిని పురస్కరించుకుని 37వ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ జేకే శేఖర్‌యాదవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 18వ తేదీ ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ, 5గంటలకు అభిషేకం, 6గంటలకు గణపతి రుద్రహోమం, ఉదయం 10గంటలకు పెద్ద పట్నం, 11గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం, సాయంత్రం 4.30గంటలకు అగ్ని గుండాలు, 5.30గంటలకు ఎల్లమ్మకు బోనాల సమర్పణ, 19వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో సోమవారం మొత్తం 25 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చాయని వైద్యాధికారులు తెలియజేశారు. దుండిగల్ పీహెచ్‌సీ, షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీలో సైతం కోవిడ్ పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

శ్రీరేణుకాఎల్లమ్మ దేవాలయంలో చండీ హోమం



బాలయ్యనగర్ శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయంలో చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లోని శ్రీరేణుకాఎల్లమ్మ దేవి 19వ వార్షికోత్సవ జాతర ప్రారంభమైంది. సోమవారం బొడ్రాయి పూజ, నవగ్రహ ఆరాధన, చండీహోమం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. మంగళవారం అమ్మవారి ప్రధాన జాతర ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

ప్రజావాణికి 70 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్ ప్రజావాణిలో సోమవారం ప్రజలు వివిధ సమస్యలపై అందజేసిన 70 ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతో వచ్చే ప్రజల అర్జీదారులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం



మహ్మద్ పటేల్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ గణేష్

దుండిగల్: దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ ఓ పేదింటి యువతి వివాహానికి ఆర్థిక సహాయం అందజేశారు. దుండిగల్ 5వ వార్డుకు చెందిన మహ్మద్ పటేల్ కుమార్తె వివాహం ఇటీవల నిశ్చయమైంది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో విషయం తెలుసుకున్న కావలి గణేష్ సోమవారం తనవంతు సహాయంగా పెళ్లి ఖర్చులను యువతి తల్లిదండ్రులకు అందజేశారు.

రూ.11కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం

- జీడిమెట్ల కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డి
- డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికై రెండేళ్లు పూర్తి
- మూడోఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సాక్షితో మాటామంతి

కుత్బుల్లాపూర్: ప్రజలకు మౌలిక వసతులు కల్పించే దిశగా ముందుకు సాగుతూ అభివృద్ధి పనులు చేపడతామని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి అన్నారు. ఈనెల 11 తేదీ నాటికి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడో సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ×సాక్షి×తో ఆమె మాట్లాడారు. డివిజన్ పరిధిలో ఇప్పటికే 11 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రణాళికలు రూపొందించుకుని పనులు చేపడతామని స్పష్టం చేశారు.

◆ వినాయక నగర్, అంగడిపేట్, జీడిమెట్ల ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న విషయాన్ని ఇప్పటికే ఎలక్ట్రికల్ అధికారులకు విన్నవించాం. అట్టి పోల్స్‌ను వెంటనే మార్చాలని కోరడంతో అధికారులు పర్యటించి వెళ్లారు. వాటిని తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ రూపొందించాం.

◆ మర్రి నారాయణరెడ్డి నగర్, ఫస్ట్ ఎవెన్యూ, ప్రసూననగర్ ప్రాంతాల్లో వర్షం పడ్డ ప్రతిసారి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇక్కడ వర్షపునీరు వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ పక్కనే ఉన్న వాజ్‌పేయినగర్‌లో పనులు జరగకపోవడం మూలంగా కొంత ఇబ్బంది తలెత్తుతుంది. ఈ వర్షాకాలం నాటికై నా పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులపై ఒత్తిడి తెస్తాం.

◆ అయోధ్యనగర్‌లో మొత్తం ఇప్పటికే సిమెంట్ రోడ్లు పూర్తి చేయడం జరిగింది మరో నాలుగు రోడ్లు పెండింగ్ ఉన్నాయి. వాటిని కూడా దశలవారీగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.



◆ ప్రశాంత్‌నగర్‌లో మొత్తం సిమెంట్ రోడ్లు పూర్తి చేయగా అక్కడ ఏడు మ్యాన్‌హోల్స్ ఇబ్బందికరంగా ఉండడంతో రోడ్డు పనులు నిలిపివేశాం. ఇంజినీరింగ్ అధికారులు మ్యాన్‌హోల్స్‌ను సరిచేసిన తర్వాత సిమెంట్ రోడ్డు పూర్తి చేస్తారు.

◆ వెన్నెలగడ్డ చెరువు సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇప్పటికే ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించాం. ఇక్కడ నీళ్ల దుర్వాసన వస్తున్న విషయంపై అధికారులతో పర్యటించి క్షేత్రస్థాయిలో ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను. ఇప్పటికే ఈ చెరువు సుందరీకరణ విషయంపై సుమారు 1 కోటి 50 లక్షల రూపాయలను మంజూరు చేయగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ గోదావరి హోమ్స్, గాయత్రినగర్ కాలనీల మధ్య నుంచి ఇప్పటికే వరద నీటి పనులు జరుగుతున్నాయని.. ఈ పనులు పూర్తయితే వర్షపు నీరు ఫాక్స్‌సాగర్ చెరువు నాలాలోకి వెళ్తుందని అన్నారు.

ఊర చెరువును కబ్జా నుంచి కాపాడి ఫెన్సింగ్ వేయాలి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 288లోని ఊర చెరువును ఆక్రమిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని చెరువును పరిరక్షించాలని కోరుతూ సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో, ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్‌కు కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గతంలో చెరువు కబ్జా విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. అధికార పార్టీ నాయకులు అండదండలు ఉండటంతో చెరువులో రాత్రికి రాత్రి మట్టి పోసి పూడ్చి వేస్తున్నారని ఆరోపించారు. మొన్న ఉమామహేశ్వరి కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాల చేపట్టగా తాజాగా ఊర చెరువు ఆక్రమణకు గురవుతోందని, వీటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కబ్జాల నుంచి ఊర చెరువు కాపాడాలని కోరారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోని పక్షంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కొంపల్లి మున్సిపల్ శాఖ నాయకులు బైరి ప్రశాంత్‌గౌడ్, ఆదిరెడ్డి సురేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కావాలి గోపాల్‌ముదిరాజు, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.



ఊర చెరువును పరిరక్షించాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎస్ఎల్‌జీ ఆస్పత్రిలో 18వ తేదీ ఉచిత కన్సల్టేషన్

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆస్పత్రిలో ఈ నెల 18వ తేదీ వరకు 50 సంవత్సరాలు పైబడిన వారికి ఉచితంగా వైద్యుల కన్సల్టేషన్ సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం ఓ ప్రకటనలో తెలియజేసింది. గైనకాలజీ, యూరాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, నెఫ్రాలజీ, ఆంకాలజీ, పల్మనాలజీ లాంటి పలు విభాగాలకు చెందిన వైద్యుల కన్సల్టేషన్ పాటు గుండె పరీక్షలకు సంబంధించి బీపీ, బీఎంఐ, జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ పరీక్షలు ఉచితంగా చేయనున్నారు.

◆ అదే విధంగా సీటీ స్కానకు 20 శాతం, ఎక్స్‌రే పరీక్షకు 50 శాతం, ఒక వేళ శస్త్ర చికిత్స అవసరమైతే 15 శాతం రాయితీ ఇవ్వనున్నారు. బీహెచ్‌ఈఎల్, ఎన్ఆర్ఎస్ఏ, సీజీహెచ్ఎస్/కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వారికి సంబంధించిన ప్యాకేజీలన్నీ అమలు కావడంతో పాటు ఉచిత కన్సల్టేషన్ సేవలు అందుతాయి. ఇతర వివరాలకు 040–23785678లో సంప్రదించాలని ఆస్పత్రి యాజమాన్యం కోరింది.


రోడ్లపైన వాహనాల రిపేర్లు

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్లు కార్లు, ఆటోల రిపేర్లకు అడ్డాలుగా మారుతున్నాయి. సూరారం డివిజన్ పరిధిలోని గాజులరామారం నుంచి షాపూర్ నగర్‌కు వచ్చే చౌరస్తా సమీపంలో కొందరు మెకానిక్‌లు రోడ్లపైనే వాహనాల రిపేర్లు కొనసాగిస్తున్నారు. అసలే ఈ రోడ్డు నిత్యం వాహనాల తాకిడితో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు రోడ్లపైనే ఆటోలు, ఇతర వాహనాలను నిలిపి రిపేర్లు చేస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటకంగా మారుతోంది.. సంబంధిత టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు రోడ్ల అక్రమణలకు పాల్పడుతున్న మెకానిక్ దుకాణాల నిర్వాహకులను కట్టడి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



గాజులరామారం నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో చౌరస్తా సమీపంలో ఇలా రోడ్డుపైనే రిపేర్లు

'జల్‌శక్తి' అవార్డు రేసులో 'ఉర్దూ విశ్వవిద్యాలయం'



'మనూ'లో పర్యటిస్తున్న కేంద్ర బృందంతో మనూ బృందం

రాయదుర్గం: కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ ఉన్నత స్థాయి బృందం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌ను సందర్శించింది. ఉర్దూ విశ్వవిద్యాలయంలో క్యాంపస్‌లో వినియోగానికి ఉత్తమ సంస్థ కింద 4వ జాతీయ నీటి అవార్డుల కోసం ఉర్దూ విశ్వవిద్యాలయం దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో గ్రౌండ్ ట్రూటింగ్ కోసం సందర్శిం చింది. ఉర్దూ విశ్వ విద్యా లయం ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు కోసం దరఖాస్తు చేసింది. కేజీబీఓ సీడబ్ల్యూసి హైదరాబాద్‌లోని చీఫ్ ఇంజనీర్ డి రంగారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసుబైరి ఆధ్వర్యంలోని బృందంలో సైంటిస్ట్ కరోలినాలూయిస్, సీడబ్ల్యూసీ పీపీ ఎంవికేసురేష్‌లతో కూడిన బృందం క్యాంపస్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా వారు క్యాంపస్‌లోని నీటి వనరులు నీటి కొలనులు, వాటర్ హార్వెస్టింగ్‌పిట్స్, బోరువావుల వినియోగం వంటి వాటిని వారు పరిశీలించారు. కేంద్ర బృందానికి మనూ జల్‌శక్తి అభియాన్ చైర్మన్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్ స్వాగతం పలికారు.

'అక్షయపాత్ర'ను సందర్శించిన హెచ్‌సీయూ విద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని సంస్కృత అధ్యయనాల విభాగం విద్యార్థులు అక్షయపాత్ర 33వ కమ్యూనిటీ కిచెన్‌ను సందర్శించారు. ఈ మేరకు సోమవారం హెచ్‌సీయూ పీఆర్ఓ ఆశిష్‌జాకబ్‌థామస్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చెందిన 33వ వంటశాలను ప్రొఫెసర్ జేఎస్ఆర్ ప్రసాద్ నేతృత్వంలోని సంస్కృత అధ్యయనాల విభాగం ఎంఏ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు సందర్శించారు.

